ప్రజల మాట ప్రగతి బాట





లెక్చరర్స్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు కొసనం వెంకట్‌రెడ్డి

## ఎల్బీ నగర్‌లో ఎగిరేది గులాబీ జెండానే..

మన్సూరాబాద్, అక్టోబర్ 13: కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్ని అబద్ధపు దుష్ప్రచారాలు చేసిన ఎల్బీనగర్‌లో ఎగిరేది గులాబీ జెండానేనని బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు కొసనం వెంకట్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్ పరిధి లెక్చరర్స్‌కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదని గ్రహించిన ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నాయకులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని కొందరు చోటా నాయకులు ఎమ్మెల్యేపై అబద్ధపు రాతలతో కూడిన కరపత్రాలను పంచుతున్నారని తెలిపారు. నీతి, నిజాయితీకి మారు పేరైన ఎమ్మెల్యేపై ఎన్ని అసత్య ఆరోపణలు చేసిన విజ్ఞులైన ఎల్బీనగర్ ప్రజలు నమ్మరని తెలిపారు. అభ్యర్థులను ప్రకటించుకోలేని స్థితిలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగినరీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా విభాగం డివిజన్ అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి, సతీశ్, హర్షిత, తేజస్విని, అనిత, మమత, రంగారెడ్డి, నర్సింహారెడ్డి, పద్మ, మాలతి, శైలజ, రాధిక, సుష్మిత, పారిజాత, నర్మద, లీలా, లింగారెడ్డి, నవ్య, శ్యామల, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉత్తమ ఫలితాలు



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు

హయత్‌నగర్, అక్టోబర్ 13: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని హయత్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీదేవి సూచించారు. శుక్రవారం హయత్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 2022-23 విద్యా సంవత్సరం బైపీసీ గ్రూపులో అత్యధిక మార్కులు (983/1000) సాధించిన విద్యార్థిని సోనికి రూ.5వేలు, ఐఐటీ జమ్ములో సీటు సాధించిన విద్యార్థి నరేశ్‌కు రూ.5వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు. కళాశాలలో అన్ని గ్రూపుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కూడా నగదు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# ప్రకృతిని ఆరాధించే పండుగ 'బతుకమ్మ'

హయత్‌నగర్, అక్టోబర్ 13: తెలంగాణలో బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ అని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ తెలిపారు. శుక్రవారం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్నప్రభ హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీకని కొనియాడారు. పుష్పాలు బాగా వికసించే కాలంలో జలవనరులు సమృద్ధిగా పొంగి పొర్లే సమయంలో బతుకమ్మ పండుగ వస్తుందన్నారు. భూమి, జలంతో మానవ అనుబంధాన్ని గొప్ప సంబురంగా బతుమ్మ పండుగ జరుపుకొంటారని వివరించారు. బతుకమ్మ సంబురాల్లో బొడ్డెమ్మ(దుర్గాదేవి)ను బతుకమ్మతోపాటు తయారు చేసి ఆటపాటల అనంతరం నిమజ్జనం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఈ.శంకర్‌నాయక్, డాక్టర్ ధన్‌రాజ్, డాక్టర్ రాకేశ్ భవాని, డాక్టర్ సురేశ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జాహెదాబేగం, డాక్టర్ సునీత, డాక్టర్ మంజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ, విద్యార్థినులు





హస్తినాపురం ఓ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థినులు, అధ్యాపకులు

### కన్నుల పండువగా బతుకమ్మ సంబురాలు

వనస్థలిపురం, అక్టోబర్ 13: హస్తినాపురంలోని ఓ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు కన్నుల పండువగా జరిగాయి. విద్యార్థినులు బతుకమ్మలు తీసుకువచ్చి, సంప్రదాయం ఉట్టి పడేలా పాటలతో బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూల పండుగ నిర్వహించడం మన గొప్పదనం అన్నారు. అనాదిగా వస్తున్న సంస్కృతిని పరిరక్షించుకుని భవిష్యత్ తరాలకు అందజేయాలన్నారు. ఉత్సవాలు నిర్వహించిన విద్యార్థినులను అభినందించారు.



శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్‌డీ భవానీ, సంగీత, రోజతో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు. – శంషాబాద్ రూరల్, అక్టోబర్ 13







మహేశ్వరం డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ సంగి రమేశ్, సలీం, రాజునాయక్, రమేశ్, లెక్చరర్లు, విద్యార్థులు. – మహేశ్వరం, అక్టోబర్ 13

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ పండగను ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు బతుకమ్మను పేర్చి ఆటాపాటలతో ఆనందంగా బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు.

– మణికొండ అక్టోబర్ 13



